క్లుప్తంగా

## కరుణామయుడు యేసుక్రీస్తు

**నాగర్‌కర్నూల్‌రూరల్:** కరుణామయుడు యేసుక్రీస్తు అని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ శివారులో సుఖజీవన్‌రెడ్డి గార్డెన్‌లో క్రిస్మస్ మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని మతాల వారికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం అన్నారు. ఇతరులతో ప్రేమ, కరుణ తో మెలగాలన్నారు. అనంతరం క్రిస్టియన్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

## ఘనంగా క్లాస్‌మేట్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

**తాడూరు:** మండలంలోని భలాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం క్లాస్‌మేట్ క్లబ్‌బ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పోలె శ్రీనివాసులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్ఎం గోవింద్‌రెడ్డి, క్లాస్‌మేట్ సభ్యులు పాలమూరు శ్రీనివాసులు, విష్ణుమూర్తి, సునేంద్ర, మహేష్‌లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక

**నాగర్‌కర్నూల్ క్రైం:** టీఎస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా తెలకపల్లి యాదయ్య, డిపో అధ్యక్షుడిగా శ్రీనివాస్, డిపో కార్యదర్శిగా లక్ష్మయ్య, డిపో కోశాధికారిగా జగన్మోహన్, వైస్ ప్రెసిడెంట్‌గా వీఎస్ నారాయణ, జాయింట్ సెక్రెటరీగా సుకన్య, పౌర్ణమిలు ఎన్నికయ్యారు.

## దుస్తులు పంపిణీ

**పెద్దకొత్తపల్లి:** పెద్దకార్పాముల గ్రామానికి చెందిన వార్మల సునీత లక్ష్మీకాంత్‌రెడ్డి దంపతుల కుమార్తె సహస్ర పుట్టిన రోజు సందర్భంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. వర్మాల వెంకటేశ్వరమ్మ, యాదగిరిరెడ్డి, నిర్మల, బాలస్వామి, శ్రీనివాసులు, చాంద్‌పాషా, లక్ష్మీ, చిట్టెమ్మ, శాంతమ్మ, నిరంజనమ్మలు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కలు తొలగింపు

**కల్వకుర్తిరూరల్:** మండలంలోని వెంకటాపూర్, జీడిపల్లి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను బీజేపీ సీనియర్ నాయకుడు బండెల రామచంద్రారెడ్డి సొంత ఖర్చులతో తొలగించారు. మంగళవారం డోజర్ ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను తొలగించి, మట్టిని చదును చేశారు. గ్రామస్తులు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**కల్వకుర్తిరూరల్:** తెలంగాణ ఉద్యమంలో తమ గళాన్ని వినిపించిన కళాకారులకు శాసన సభ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇవ్వడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కల్వకుర్తిలో కళాబృందం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు సుకుమార్, రమేష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో పడిపూజ



**లింగాల:** మండలంలోని రాయవరం ఆంజనేయస్వామి ఆలయం సన్నిధానంలో మంగళవారం ఆంజనేయస్వామి పడిపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు, గిరిజన ఉద్యోగ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, నాయకులు ఉల్లగొండ రాజు, భక్తులు పాల్గొన్నారు.

## డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**కోడేరు:** మండలంలోని తీగలపల్లి పల్లె దవాఖానాకు నియమించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ్మ అన్నారు. మంగళవారం ఆయన పల్లె దవాఖానాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీగలపల్లి, జనుంపల్లి, బావాయిపల్లి గ్రామాల ప్రజల కోసం పల్లె దవాఖానకు డాక్టర్‌ను నియమిస్తే అక్కడ విధుల్లో చేరకుండ కోడేరు పీహెచ్‌సీలో విధులు నిర్వహించడం ఎంతవరకు సమంజమని మండిపడ్డారు. విధులకు హాజరు కాకపోతే ధర్నా చేపడుతామని హెచ్చరించారు. శివశంకర్, వరప్రసాద్, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు గీతా పారాయణం

**కందనూలు:** జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 10:00 గంటలకు సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు జిల్లా వికాస తరంగిణీ అధ్యక్షుడు బిల్లకంటి బాలస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులకు అన్న ప్రసాదం ఉంటుందని పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



కల్వకుర్తిలో పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం, నాయకులు

**కల్వకుర్తిరూరల్:** తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్పుపై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం నిరసన తెలిపి పాలమూరు చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడుతూ రూ.4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా విగ్రహం రూపురేఖలు మార్చాడన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీశైలం, సాహెబ్, సూర్యప్రకాష్‌రావు, బోజిరెడ్డి, సైదులుగౌడ్, మధు, తాహేర్ అలీ, శ్రీను, వెంకటయ్యగౌడ్, రాములు, నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం**

**వెల్దండ:** మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, మేధావులు రూపుదిద్దినా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రస్తుత ప్రభుత్వం మార్చడం సిగ్గుచేటన్నారు. మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నర్సింహ్మ, నాయకులు జోగయ్య, యాదగిరి, రవికుమార్, శ్రీనివాస్, ప్రసాద్, శేఖర్, హన్మంత్‌నాయక్, మధుసూదన్‌రెడ్డి, అశోక్, అంజయ్య ఉన్నారు.

**కొల్లాపూర్:** పట్టణంలోని పబ్లిక్ పార్కులో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చిందన్నారు. నరేందర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, కట్టా శ్రీనివాసులు, కాటం జంబులయ్య, సురేందర్ రావు, రుక్మద్దీన్, శ్రీనివాసులు, కుమార్, శేఖర్ తదితరులు ఉన్నారు.

# మూడో మహాసభ పోస్టర్లు విడుదల



పెద్దకొత్తపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలో సీపీఎం జిల్లా మూడో మహాసభల పోస్టర్లను జిల్లా నాయకులు ఈశ్వర్, మండల కార్యదర్శి దశరథంలు మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 14వ తేదీన అచ్చంపేటలో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు డీఈ రాఘవులు, గోరటి వెంకన్న, డీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ హాజరవుతారని పేర్కొన్నారు. కాశన్న, రాణి, బాలస్వామి, మద్దిలేటి, రాజేందర్, ఈసూప్, సుధాకర్, రాముడు, రేణుక, ఎల్లమ్మ, జ్యోతి, బాలమ్మ, బాలీశ్వరమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

**ఉప్పునుంతల:** అచ్చంపేట పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు ఎల్ దేశ్యానాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కాంసానిపల్లిలో నిర్వహించిన మహాసభల సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మండల కార్యదర్శి చింతల నాగరాజు, నాయకులు శివకుమార్, రాములు, లక్ష్మయ్య, మన్మదగౌడ్, వెంకటయ్య, రామస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పోటీలతో నైపుణ్యం మెరుగు

**తాడూరు:** సైన్స్ పోటీలతో విద్యార్థుల నైపుణ్యం మెరుగవుతుందని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నల్లమల బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి సైన్స్ పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పోటీలు దోహదం చేస్తాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫోరమ్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## డీఈఓకు వినతి



**నాగర్‌కర్నూల్‌రూరల్:** జిల్లాలోని గురుకుల పాఠశాలలో, కస్తూర్బాగాంధీ పాఠశాలలో, ప్రభుత్వ హాస్టల్‌లో నిత్యం చోటు చేసుకుంటున్న ఫుడ్‌పాయిజన్ ఘటనలపై చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న టీం సభ్యులు మంగళవారం డీఈఓ రమేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోరంట్ల సతీష్ మాట్లాడుతూ నాగనూలు కస్తూర్బా కళాశాలలో ఫుడ్‌పాయిజన్ అయ్యి ముగ్గురు విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని వివరించారు. ఫుడ్‌పాయిజన్ ఘటనలపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న రాష్ట్ర కమిటీ సభ్యులు గోరంట్ల సతీష్, జిల్లా కమిటీ అధ్యక్షుడు పరశురాం, శివ, సల్మాన్, జితేందర్, వసీం తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత లోపించొద్దు

**కల్వకుర్తి:** అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించొద్దని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం పట్టణంలోని పురపాలక పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వైస్ చైర్మన్ మహమ్మద్ షాహెద్, అసిస్టెంట్ ఇంజనీర్ షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల నిరసన

**బిజినేపల్లి:** మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఓ వర్గానికి చెందిన ఫ్లెక్సీని మరో వర్గానికి చెందిన వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున చింపివేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాంధ్యమాల్లో వైరల్ కావడంతో హిందూ సంఘాలు, అయ్యప్ప స్వాములు, ఆంజనేయ స్వాములు ప్రధాన కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ కనకయ్య గౌడు, ఎస్ఐ శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డిలు ఘటన స్థలానికి చేరుకుని ఫ్లెక్సీ చింపివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

## పంచాయతీ రికార్డుల పరిశీలన

**బల్మూర్:** గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీఎల్‌పీఓ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో ప్రభుత్వం 11 ఏళ్లలో రూ.3కోట్లకు పైచిలుకు నిధులు వివిధ పథకాల ద్వారా మంజూరు కాగా, చేపట్టినిధులపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీఓ నర్సిరెడ్డి తెలిపారు.

## ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

**తాడూరు:** మండలంలోని మేడిపూర్, ఐతోలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ బ్రహ్మచారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కోడేరు:** మండలంలోని నార్యనాయక్ తండాలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోజ్యా నాయక్, శివ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## పండుగసాయన్న వర్ధంతి



**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం పండుగ సాయన్న 134వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగసాయన్న చిత్రపటానికి మత్స్యకార్మిక సంఘం మండల అధ్యక్షులు గడ్డికోపుల ఎల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండుగ సాయన్న దొరల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గట్టు ఆంజనేయులు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లయ్య, సహాయ కార్యదర్శి ఆంజనేయులు, రాముడు, రామస్వామి, రమేష్ పాల్గొన్నారు.

## మాదిగలు ఏకం కావాలి

**వెల్దండ:** వర్గీకరణ కోసం మాదిగలు ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు భీముని వీరస్వామిమాదిగ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దుబ్బ నాగేష్‌మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాటిక రామస్వామి, కిరణ్, మీసాల అంజయ్య, పుల్లయ్య, పోలేరాజు, అంజయ్య, శ్రీను,జంగయ్య, భరత్, కిష్టాల్, అశోక్, జంగయ్య, రాజు, నారాయణ, శ్రీను, బాల్‌జంగయ్య తదితరులు ఉన్నారు.

## రూ. 1.30 లక్షలు రికవరీ



**పెద్దకొత్తపల్లి:** మండలంలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.1.30 లక్షలు అక్రమాలు జరిగాయి. 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సభ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మేరకు అక్రమాలకు సంబంధించి మొత్తం రూ.1.30లక్షలను రికవరీ చేసినట్లు ఏపీడీ రాజేశ్వరి పేర్కొన్నారు. ఎస్ఆర్పీ నర్సయ్య, పొలిటికంట్రోల్ ఎంపీఓ కృష్ణారావు, సోషల్ ఆడిట్ ఏఓ నజీర్, ఎంపిడిఓ నాగేందర్, ఏపీఓ మంజుల, పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి



**తెలకపల్లి:** ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండల ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. కాంప్లెక్స్ మీటింగ్‌హాల్‌లో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబాల సర్వేపై చర్చించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతోపాటు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటయ్య, ఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ అపహరణ

**తిమ్మాజిపేట:** మండల కేంద్రంలో ఆగి ఉన్న డీసీఎం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం డీజిల్ చోరీ చేశారు. స్థానికుల వివరాల ప్రకారం వట్టిపు మహేష్ ప్రతి రోజు మద్యం డిపో నుంచి మిడ్జిల్, ఊర్కొండ మండలాలలో ఉన్న మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేస్తుంటాడు. సోమవారం రాత్రి డీసీఎంలో 127 లీటర్ల డీజిల్ పోయించుకొని తిమ్మాజిపేటలో ప్రధాన రహదారి పక్కనే పూలే విగ్రహం సమీపంలో పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం వాహనం స్టార్ట్ చేసేందుకు వెళ్లగా ఎంతకు స్టార్ట్ కాలేదు. డీజిల్ ట్యాంకు మూత తెరిచి ఉండడంతో డీజిల్ దొంగతనం అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కల్వకుర్తి:** మున్సిపాలిటీ శివారులోని కేఎల్ఐ కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మాధవరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కేఎల్ఐ కాల్వలో ఓ వ్యక్తి (40) మృతదేహం చుట్టుపక్కల పొలాల వారికి కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా వ్యక్తిని గుర్తిస్తే సెల్: 8712657752 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**పెంట్లవెల్లి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను హెచ్ఓ సువర్ణను అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాజీ సర్పంచ్, రాజేష్, సురేందర్‌గౌడ్, రాము, సుమన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

**నాగర్‌కర్నూల్ క్రైం:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పరిసరాలతో పాటు పలు దుకాణాలలో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు డ్రగ్స్, మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.



# ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ కీలకం



అవగాహన కల్పిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

**కందనూలు:** ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమని డీఈఓ ఎ.రమేష్ కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదిరి ఎన్నికలు నిర్వహించి, విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ.. విద్యార్థులతో కలిసి ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమన్నారు. ప్రతి విద్యార్థికి భారత ఎన్నికల సంఘం విధివిధానాలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని సూచించారు. పాఠశాలలో మాదిరి ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

## జిల్లా కార్యవర్గం ఎన్నిక

**నాగర్‌కర్నూల్:** తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఏ-445(భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం) కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రకాష్ గౌడ్, కార్యదర్శిగా ఎం. బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా ఎ. విజయ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చెన్నకేశవులు, ప్రభాకర్, అభినాష్‌రెడ్డి, కురుమయ్య, శేఖర్, జీవన్, రాము, నాగరాజు, మద్దిలేటిలను ఎన్నికయ్యారు. అనంతరం ఎస్ఈ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీగా గుండాల ఎంపిక

**వెల్దండ:** మండలంలోని గుండాల గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ కింద మరుగుదొడ్లను నిర్మించుకొని సక్రమంగా వాడడం, శుభ్రతత్వం పాటించడంతో గుండాల గ్రామంలోని భూజరాజు మణమ్మను అడిషన్ కలెక్టర్ దేవసహాయంతో పాటు అధికారులు సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ ఆయన తెలిపారు. డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి వాణి, ఈశ్వర్‌జీ పాల్గొన్నారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్



**నాగర్‌కర్నూల్‌రూరల్:** క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్ అన్నారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా మంగళవారం జెడ్పీ గ్రౌండ్‌లో సీఎం కప్ మున్సిపాలిటీ జట్ల ఎంపికలు నిర్వహించారు. పరుగు పెందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు శ్రీను, నిజాముద్దీన్, సునేంద్ర, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఓ కోటేశ్వర్లు, పీఈటీలు వెంకటయ్య, సుహాసిని, రమేష్, రజన్‌గౌడ్, సత్యనారాయణ, దివ్యా, కృష్ణ, రవి, మల్లేష్, శిరీష, సంపూర్ణ, నర్సింహారెడ్డి, రాఘవులు

## ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తప్పనిసరి

**లింగాల:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ ఉండాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని సూరాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అపార్ ఐడీ గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ ఐడీ ద్వారా విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో ఉంటుందని, విద్యార్థికి పలు రకాల ప్రయోజనాలు ఉంటాయని ఎంఈఓ తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సంబంధించి రికార్డులను ఆయన పరిశీలించారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



**తెలకపల్లి:** మండల కేంద్రంలోని బాలికల పాఠశాల, సీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం రాష్ట్రీయ బాల స్వస్థీయ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ లోపం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు అక్బర్ మాట్లాడుతూ వ్యక్తిశుభ్రత శుభ్రత పాటించాలన్నారు. ప్రతి రోజు వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రావ్య, ఏఎన్ఎం జయసుధ, హెచ్ఎం సుదర్శనాచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

**నాగర్‌కర్నూల్‌రూరల్:** జిల్లా కేంద్రంలో మంగళవారం హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏరియా ఆస్పత్రిలో 100 మంది రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవంచ శాల్వాచారి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం నిత్యం పనిచేస్తున్నామన్నారు. ఆదేవిధంగా జ్ఞాన వికాస భారతి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. మానవ హక్కుల సంఘం కార్యదర్శి అతినారపు పర్వతాలు, ఉపాధ్యక్షుడు కొత్త బాలు, జిల్లా దిశా కమిటీ అధ్యక్షురాలు సుధారాణి, కనుకయ్య, సుధారాణి, సంజీవగౌడ్, ధనుంజయ్, బాలస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీలు ప్రారంభం

**తాడూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వెనుకభాగాన ఉన్న క్రీడా మైదానంలో మంగళవారం సీఎం కప్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీలలో విజేత శిర్సవాడ జట్టు, రన్నర్‌గా తాడూర్ జట్టు నిలిచాయి. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మచారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అనిత, నిర్మల, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, శ్రీకాంత్ సీనియర్ క్రీడాకారులు కురుమయ్య, రఘులు పాల్గొన్నారు.

**రేపు వెల్దండలో..**

**వెల్దండ:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈ నెల 12 నుంచి మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, కబ్బడ్డీ, ఖోఖో, స్పోర్ట్సు లాంగ్‌జంప్, రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో బాలురు, బాలికలకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ఉప్పునుంతల:** జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను ఈ నెల 12న నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్



చారకొండ పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

**తెలకపల్లి:** ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు తరలివెళ్తారనే సమాచారంతో ముందస్తుగా పోలీసులు ఆశావర్కర్లు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గోపస్ లక్ష్మణ్, సీఐటీయూ మండల నాయకులు విజయ్‌గౌడ్ మాట్లాడుతూ ఆశావర్కర్లను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

**చారకొండ:** ఆశావర్కర్లకు ఇచ్చిన హామీని అమలు చేయడంలేదని నిరసిస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేసే ఆశావర్కర్లను ముందస్తుగా అరెస్టు చేశారు. సాయంత్రం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి ఆశావర్కర్ల ముందస్తు అరెస్టును ఖండించారు.

**వెల్దండ:** కొల్లాపూర్, నాగకర్నూల్, అచ్చంపేటకు చెందిన ఆశా కార్యకర్తలు ఆర్టీసీ బస్సులో వెళ్తున్న వారిని పోలీసులు గుర్తించి వారిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

# పురాతన ఆలయాభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత రాజు

**అచ్చంపేట రూరల్:** పట్టణంలోని ఉట్లకోనేరు పురాతన ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, శివాలయం అభివృద్ధి కోసం పట్టణానికి చెందిన సాదె రాజు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 5 లక్షల విరాళం అందజేశారు. అచ్చమ్మపేటగా అవతరించినప్పటి నుంచి ఉట్ల కోనేరులోని దేవాలయాలు ఎంతో చరిత్ర ఉందని, పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతుగా సాయం చేస్తున్నానని దాత రాజు తెలిపారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

**రూ.50 వేలు అందజేత**

**కల్వకుర్తిరూరల్:** పట్టణంలో నిర్మించే మాతా పోచమ్మ దేవాలయ నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.50 వేలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. త్వరలో రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతయ్య, గణేష్, హనుమానాయక్, నర్సింహ, సత్యం, శ్రీనివాసులు, రాజశేకర్, బాలస్వామి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**రూ.25 వేల విరాళం**

**వెల్దండ:** మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, లాయర్ చిందం కృష్ణయ్య మంగళవారం శివునిగుట్ట అభివృద్ధికి రూ.25 వేల విరాళం అందజేశారు. శివుని గుట్టపై పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, యువకులు తదితరులు ఉన్నారు.